నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, ఆదివారం 1 సెప్టెంబర్ 2024 YADADRI BHUVANAGIRI


కోదాడ : మున్సిపల్ కార్యాలయంలో నీట మునిగిన ఫైళ్లు

## విజయవాడకు వెళ్లే వాహనాల దారి మళ్లింపు

నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 31(నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే వాహనాలను భారీ వర్షాల నేపథ్యంలో నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి వద్ద గుంటూరు మీదుగా దారి మళ్లిస్తున్నట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఏపీలోని జగ్గయ్యపేట వద్ద జాతీయ రహదారిపై వరద ప్రవహిస్తున్నందున వాహనాలను నార్కట్‌పల్లి – అద్దంకి రహదారి మీదుగా మిర్యాలగూడ, వాడపల్లి, గుంటూరు నుంచి విజయవాడకు వెళ్లాలని సూచించారు. హైవే వెంట అధిక వాహనాలు ప్రయాణించే క్రమంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని కోరారు. హైవే వెంట వాహన రద్దీ ఉండనున్న నేపథ్యంలో రోడ్డు పక్కన ఉన్న గ్రామాల ప్రజలు ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని శనివారం రాత్రి ఓ ప్రకటనలో సూచించారు. హైదరాబాద్ నుంచి రాజమండ్రి, విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలను సూర్యాపేట సమీపంలోని రాయినిగూడెం వద్ద ఖమ్మం బైపాస్ మీదుగా మళ్లిస్తున్నారు. వాహనదారులు ఖమ్మం, సత్తుపల్లి మీదుగా రాజమండ్రి, విశాఖపట్నం వెళ్లొచ్చని పోలీసులు సూచిస్తున్నారు.


# కుండపోత

## హుజూర్‌నగర్‌లో 30 సెంటీమీటర్ల వర్షం

## చిలుకూరులో 28.5.. కోదాడలో 19.3 సెం.మీ.


హుజూర్‌నగర్‌లో భారీ వర్షంతో రోడ్లపై ప్రవహిస్తున్న వరద

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎడతెరిపిలేని వాన
- రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు
- మఠంపల్లిలో 17, అడ్డగూడూరులో 10సెం.మీ. నమోదు
- అన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం
- వాగులు, వంకలకు జలకళ
- చెరువులు, కుంటల్లోకి వరద
- పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం
- నేడూ, రేపు భారీ వర్షాలు
- కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు


హుజూర్‌నగర్ : ప్రధాన రహదారిపై వరద ప్రవాహంలో ఆగిన కారును నెడుతున్న వ్యక్తి

**నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు రెడ్ అలర్ట్**

నల్లగొండ ప్రతినిధి/ సూర్యాపేట, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ) : అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచే ముసురుతో మొదలై శనివారం అంతా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. చాలా చోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఈ వానకాలం సీజన్‌లో ఇదే పెద్ద వాన. సూర్యాపేట జిల్లాలో కుండపోత వర్షం కురిసింది. హుజూర్‌నగర్, చిలుకూరు మండలాల్లో రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. ఈ మండలాల్లో కేవలం మూడు గంటల వ్యవధిలోనే 17సెంటీమీటర్ల వర్షం పడింది. హుజూర్‌నగర్‌లో సాయంత్రం ఆరు గంటలకు 10 సెం.మీ. ఉండగా.. రాత్రి 9గంటలకు 17 సెంటీమీటర్లు పెరిగి 27.3కు చేరింది. రాత్రి 11 గంటలకు వరకు 29.8 సెం,మీ. నమోదైంది. చిలుకూరులో సాయంత్రం ఆరు గంటలకు 9సెంటీమీటర్లు ఉండగా.. రాత్రి 9గంటలకు 17 సెంటీమీటర్లు పెరిగి 26.7 సెం.మీ.కు చేరింది. రాత్రి 11గంటల వరకు 28.5 సెం.మీ. నమోదైంది. నల్లగొండ జిల్లాలో అత్యధికంగా కొండమల్లేపల్లిలో 100 మి.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో నాన్ ఆయకట్టుతోపాటు మెట్ట ప్రాంతాల్లోని పంటలకు జీవం పోసినట్లయింది. ఇప్పటివరకు సరైన వర్షాలు లేక భూగర్భజలాలు పెరుగక రైతులు పంటలు కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజా వర్షాలతో ఉపశమనం కలుగనుందని భావిస్తున్నారు. నేడు, రేపు కూడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ క్రమంలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు.

నల్లగొండ జిల్లా అంతటా శుక్రవారం సాయంత్రం నుంచే ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వాతావరణం పూర్తిగా మేఘావృతమై మబ్బులతో శనివారం రోజంతా ఎడతెరపి లేకుండా ముసురు పెట్టగా.. మధ్యమధ్యలో భారీ వర్షం పడింది. దీంతో జనజీవనానికి తీవ్ర అంతరాయం కలిగింది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లాల్సిన ఉద్యోగులు వర్షంలోనే విధులకు హాజరుకాక తప్పలేదు. శనివారం ఉదయం 6గంటల వరకు జిల్లా సగటు వర్షపాతం 8.1మిల్లీమీటర్లుగా నమోదైంది. ఆ తర్వాత రాత్రి వరకు వర్షం కురుస్తూనే ఉంది. తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లా అంతటా వర్ష ప్రభావం ఉంది. అన్ని చోట్ల పొద్దంతా వర్షం కురుస్తూనే ఉంది. శనివారం ఉదయం 8:30నుంచి సాయంత్రం 8గంటల వరకు ఉన్న లెక్కల ప్రకారం రాష్ట్రంలోనే అత్యధికంగా హుజూర్‌నగర్‌లో వర్షం కురిసింది. సాయంత్రం కుంభవృష్టిని తలపించడంతో 248.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రెండో స్థానంలో చిలుకూరులో 243.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఐదో స్థానంలో మఠంపల్లిలో 172 మి.మీ., 8వ స్థానంలో కోదాడలో 160.3మి.మీ., 11వ స్థానంలో మట్టపల్లిలో 138.3మి.మీ., 13వ స్థానంలో అనంతగిరిలో 115.5.3మి.మీ., 14వ స్థానంలో అడ్డగూడూరులో 109.5 మి.మీ., నాగారంలో 106.8మి.మీ., కొండమల్లేపల్లిలో 100మీ.మీటర్ల వర్షపాతం కురిసింది. సాయంత్రం 6గంటల తర్వాత చాలా చోట్ల భారీ వర్షం పడింది. రాత్రి వరకు కురుస్తూనే ఉంది. మరో రెండ్రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా నల్లగొండ జిల్లాలో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో రెడ్ అలర్ట్ జారీ చేసింది.


హుజూర్‌నగర్ : 7వ వార్డు ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న అధికారులు

| సూర్యాపేట | |
|---|---|
| హుజూర్‌నగర్ | 298.8 మి.మీ |
| చిలుకూరు | 285.3 మి.మీ |
| కోదాడ | 193.5 మి.మీ |
| మఠంపల్లి | 152.3 మి.మీ |
| చింతలపాలెం | 148.0 మి.మీ |
| మద్దిరాల | 146.1 మి.మీ |
| సూర్యాపేట | 144.2 మి.మీ |
| నూతనకల్ | 127.5 మి.మీ |
| అనంతగిరి | 127.3 మి.మీ |
| మోతె | 119.4 మి.మీ |
| **నల్లగొండ** | |
| కొండమల్లేపల్లి | 94.5మి.మీ |
| అనుముల | 89.5 మి.మీ |
| చందంపేట | 87.3మి.మీ |
| నార్కట్‌పల్లి | 86.3మి.మీ |
| నాంపల్లి | 85 మి.మీ |
| దేవరకొండ | 84.3మి.మీ |
| తిర్మలగిరిసాగర్ | 82.5మి.మీ |
| మునుగోడు | 76.3మి.మీ |
| నిడమనూరు | 76.3మి.మీ |
| తిప్పర్తి | 74మి.మీ |
| శాలిగౌరారం | 72.8మి.మీ |

నడిగూడెంలో 119.0, నాగారంలో 111.7, జాజిరెడ్డిగూడెంలో 108.0, నేరేడుచర్లలో 99.4, పెన్‌పహాడ్‌లో 96.3, ఆత్మకూర్.ఎస్‌లో 85.0, తిరుమలగిరిలో 83.8, గరిడేపల్లిలో 83.5, పాలకవీడులో 70.0, చివ్వెంలలో 56.5, తుంగతుర్తిలో 53.0, మునగాల 39.3గా నమోదయ్యింది.


హుజూర్‌నగర్ : పట్టణంలోని ఓ ఇంట్లోకి వచ్చిన వరద

## ఎడతెరపిలేని వాన

- జిల్లా వ్యాప్తంగా ముసురు
- అడ్డగూడూరులో 10.3 సెం.మీ. వర్షపాతం నమోదు
- జలమయమైన రహదారులు, కాలనీలు
- పలు చోట్ల నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- నేడూ భారీ వర్షాలు కురిసే అవకాశం

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ) : శనివారం ఉదయం నుంచే కుండపోత వర్షం కురిసింది. మొగులుకు చిల్లు పడ్డట్లు రోజంతా ముసురు పెట్టింది. ఎడతెరపి లేకుండా కురిసిన వానతో జిల్లా తడిసి ముద్దయ్యింది. మేఘాలు దట్టంగా కమ్ముకోవడంతో పట్టపగలే చిమ్మచీకట్లు అలుముకున్నాయి. జిల్లాలో ఎటుచూసినా నీళ్లే కనిపించాయి. కాలనీలు, రోడ్లు జలమయమయ్యాయి. కొన్ని చోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయి. అనేక ప్రాంతాల్లో ఈదురుగాలులతో చెట్లు, కరెంట్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో అక్కడక్కడ రాకపోకలు అంతరాయం ఏర్పడింది. పలు మండలాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. జిల్లాకు వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. అడ్డగూడూరు మండలంలో అత్యధికంగా 10.3 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మోత్కూరులో 4సెం. మీ., రామన్నపేటలో 3.7, పోచంపల్లి, ఆత్మకూరు (ఎం)లో 3.2, చౌటుప్పల్‌లో 2.5, గుండాలలో 2 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. ఆదివారం కూడా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.


అడ్డగూడూరు మండలంలోని చౌల్లరామారం గ్రామంలో ఈదురుగాలులతో నేలకొరిగిన కరెంట్ స్తంభాలు

### అత్యవసరం అయితే తప్ప బయటకి రావద్దు

మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. శనివారం రాత్రి, ఆదివారం అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతోపాటు యాదాద్రి జిల్లాలో సైతం భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రజలు పూర్తి అప్రమత్తతో ఉండాలని హెచ్చరించింది. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని సూచించింది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం కూడా పూర్తి అప్రమత్తంగా ఉన్నట్లు ప్రకటించింది.

### వర్షాలపై పూర్తి అప్రమత్తం : కలెక్టర్ నారాయణరెడ్డి

రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తతతో ఉండాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశించారు. వర్షాలతో ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. ఆపద సమయాల్లో ప్రజలకు అండగా నిలిచేందుకు కలెక్టరేట్‌తోపాటు వివిధ శాఖల ఆధ్వర్యంలో వేర్వేరుగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నల్లగొండ కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌లో టోల్‌ఫ్రీ నెంబర్ 18004251442ను ప్రజలు సంప్రదించవచ్చని సూచించారు. అలాగే ట్రాన్స్‌కో, ఇరిగేషన్, పంచాయతీరాజ్ విభాగాల్లోని కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని కలెక్టర్ సూచించారు.

### కోదాడ, హుజూర్‌నగర్‌లో భయం.. భయం

సూర్యాపేట జిల్లాలో శనివారం సాయంత్రం ఆరు గంటల తర్వాత ఒక్కసారిగా కుండపోత వర్షం కురిసింది. దీంతో హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో వర్షపు నీరు రోడ్లపై ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పలు ఇండ్లల్లోకి నీళ్లు చేరడంతో జనం అవస్థలు పడ్డారు. ఈ స్థాయి వర్షాలు ఎన్నడూ చూడలేదని తమ ఇళ్లల్లోకి వచ్చిన నీళ్లను చూసుకుంటూ పలువురు వృద్ధులు పేర్కొన్నారు. కోదాడ పట్టణంలోని రంగా థియేటర్ చౌరస్తా వద్ద రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. రహదారిపై వరద ప్రవహించడంతో కోదాడ – హుజూర్‌నగర్ రోడ్డులో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. వరద నీరు సాఫీగా వెళ్లడానికి స్థానికులు డివైడర్లను తొలగించారు. కాల్వ పక్కన ఉన్న 21, 29 వార్డులతోపాటు పలు చోట్ల అధికారులు గండ్లు పెట్టారు. మున్సిపల్ కార్యాలయంలో వర్షపు నీరు చేరి ఫైళ్లన్నీ తడిసి ముద్దయ్యాయి. ఆర్డీఓ సూర్యనారాయణ, మున్సిపల్ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. విజయవాడ – హైదరాబాద్ జాతీయ రహదారి 65పై జగ్గయ్యపేట వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. హుజూర్‌నగర్ పట్టణంలోని 7వ వార్డులో ఇండ్లల్లోకి నీరు చేరడంతో ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో సైతం భారీ వర్షాలు కురిశాయి. జిల్లా కేంద్రంలోని లోతట్టు ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, ఇండ్లల్లోకి వర్షపు నీళ్లు చేరాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులు వర్షంలో తడుస్తూనే సహాయక చర్యలు చేపడుతున్నారు. ప్రజల సహాయార్థం కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రజలకు ఏ అవసరం ఉన్నా, వరదలు, నీటమునక వంటి ప్రమాదాలు ఉంటే వెంటనే 62814-92368 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.


నల్లగొండ అర్బన్ ఆస్పత్రిలో చేరిన వరద నీరు

## గణేశ్ ఉత్సవాలను సమన్వయంతో నిర్వహించాలి


- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 31 : అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి గణేశ్ నవరాత్రి ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహించాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో గణేశ్ ఉత్సవాల ఏర్పాట్లపై శనివారం డీసీపీ రాజేశ్‌చంద్ర, అదనపు కలెక్టర్లు కె.గంగాధర్, పి.బెన్‌షాలోమ్, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు, ప్రజానీకానికి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. విగ్రహాల నిమజ్జనానికి తగిన ఏర్పాట్లు చేయాలని, రూట్ మ్యాప్‌లు సిద్ధం చేసుకోవాలని, అవసరమైన రూట్లలో రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. నిమజ్జన స్థలాల వద్ద భారీ క్రేన్లు ఏర్పాటు చేయాలని, చెరువుల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఫస్ట్ ఎయిడ్ కిట్లను, మెడికల్ ఆఫీసర్, సిబ్బందితో బృందాలను ఏర్పాటు చేసి అందుబాటులో ఉంచాలని అన్నారు. నిమజ్జనం రోజుల్లో నిరంతరాయంగా విద్యుత్ ఉండేలా ఇప్పటి నుంచే అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. వినాయక నిమజ్జన సమయంలో విద్యుత్ తీగల సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో మండపాలకు విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. గణేశ్ ఉత్సవాల ప్రారంభం నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు అగ్నిమాపక శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. నిమజ్జనం ఏర్పాట్లపై మండల స్థాయిలో, గ్రామాల్లో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. డీసీపీ రాజేశ్‌చంద్ర మాట్లాడుతూ గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా కట్టుదిట్టమైన భద్రత ఉంటుందన్నారు. విగ్రహాలకు తగ్గట్లుగా వాహనాలను ఏర్పాటు చేసుకోవాలని, అవి కండిషన్‌లో ఉండేలా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తాసీల్దార్లు, శాంతి సంఘం, ఉత్సవ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

## స్వామివారి సేవలో బీసీ కమిషన్ చైర్మన్

యాదగిరిగుట్ట, ఆగస్టు 31 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి సేవలో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ పాల్గొని తరించారు. తన పదవి గడువు ముగుస్తుండడంతో శనివారం కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అర్చకులు సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆశీర్వాద మండపంలో అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ ఈఓ భాస్కర్‌రావు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు కావాలన్నారు. మూడేండ్ల పదవీ కాలం ఎంతో ఆత్మ సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. పదవులు నిర్వహించడం తనకు కొత్త కాదని, ఏ జాతుల హక్కుల కోసం కృషి చేశానో ఆ వర్గాలకు చెందిన బీసీ కమిషన్ చైర్మన్‌గా పనిచేయడం తన జీవితంలో మధుర ఘట్టమని పేర్కొన్నారు. కుల గణనకు ప్రశ్నావళి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకు నిర్దిష్ట ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి అందజేశామని చెప్పారు. కులగణన నిర్విఘ్నంగా కొనసాగించేందుకు ప్రభుత్వానికి కావాల్సిన శక్తిని ప్రసాదించాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు కోరుతున్న విధంగా ప్రజాప్రతినిధ్యం పెరుగాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.


లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్